క్లుప్తంగా

మండల సభ వాయిదా

ఎస్‌ఎస్ తాడ్వాయి: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశానికి కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపీడీఓ సుమనవాణి తెలిపారు. సర్వ సభ్య సమావేశానికి ఎంపీపీ వాణిశ్రీ, ఒక ఎంపీటీసీ సభ్యురాలు మాత్రమే హాజరు కావడంతో వాయిదా వేసినట్లు తెలిపారు. తిరిగి మళ్లీ మండల సర్వసభ్య సమావేశ తేదీని ప్రకటిస్తామని తెలిపారు. కాగా అధికారులు, గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు మండల సర్వసభ్య సమావేశానికి హాజరై కోరం లేదని తెలియడంతో తిరిగి వెళ్లిపోయారు.

వాహనాల తనిఖీ



మల్హర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని కొయ్యూరు నాగులమ్మ సమీపంలో కొయ్యూరు ఎస్సై నరేష్ గురువారం విస్తృత వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మంథని–కాటారం వైపు వెళ్తున్న వాహనాలు ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహన ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి, అనుమానితులు విచారించి వదిలేశారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

చెరువు పరిశీలన



కాటారం: కాటారం మండలం ఒడిపిలవంచ ఊర చెరువు మరమ్మతు పనుల నిర్వహణ కోసం గురువారం ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. రెండేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాల కారణంగా చెరువు తెగిపోయింది. ఇటీవల చెరువు మరమ్మతుల కోసం రైతులు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి సంబంధిత అధికారులతో మాట్లాడి మరమ్మతు చర్యలకు ఆదేశించారు. దీంతో ఇరిగేషన్ ఈఈ యాదగిరి, ఏఈఈ రాజేశ్ చెరువును పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. మరమ్మతు పనులను త్వరలోనే చేపట్టనున్నట్లు అధికారులు తెలిపినట్లు మాజీ సర్పంచ్ కోడి రవికుమార్ పేర్కొన్నారు.

మొక్కలను సంరక్షించాలి



రేగొండ: నర్సరీలో మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని రూపిరెడ్డిపల్లి, కొత్తపల్లిగోరి మండలంలోని జగ్గయ్యపేట, సుల్తాన్‌పూర్ గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించారు. నర్సరీలో మొక్కలు ఎండ తీవ్రతకు ఎండిపోకుండా నిత్యం ఉదయం, సాయంత్రం నీళ్లు పట్టాలని సిబ్బందికి సూచించారు. గ్రామంలో తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కార్యదర్శులకు సూచించారు.

గుడుంబా స్వాధీనం

ఏటూరునాగారం: వాజేడు మండలం కృష్ణాపురంలో గురువారం ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన కొడెం సందీప్, మాడె శ్రీకాంత్‌లు ద్విచక్ర వాహనంపై ఛత్తీస్‌గఢ్ నుంచి మండల కేంద్రానికి పది లీటర్ల గుడుంబాను తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రామకృష్ణ తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి ద్విచక్రవాహనం సీజ్ చేశామన్నారు. అలాగే వాజేడు మండలంలోని వాజేడు, కొంగల, పేరూరు గ్రామాలకు చెందిన గతంలో గుడుంబా కేసు నమోదు అయిన ఆరుగురు వ్యక్తులను వాజేడు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు. తనిఖీలో తిరుపతి, ప్రణయ్, నాగరాజు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

ములుగు: మహబూబాబాద్‌లో నేడు(శుక్రవారం) కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర యూత్ సెక్రటరీ, మహబూబాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ ధనసరి సూర్య అన్నారు. గురువారం ములుగులో ముఖ్య నాయకులతో జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్య మాట్లాడుతూ.. మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ నామినేషన్ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి వస్తున్నట్లు తెలిపారు. అనంతరం నిర్వహించే సభకు ములుగు నియోజకవర్గం నుంచి ముఖ్య కార్యకర్తలు, నాయకులు భారీగా కదిలి రావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బానోత్ రవి చందర్, ఓబీసీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ వంగ రవి, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు గొల్లపెల్లి రాజేందర్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి, మండల అధ్యక్షుడు చాంద్ పాషా పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



గణపురం: క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

గణపురం: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం గణపురం మండలంలోని కొండాపురంలో ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భూపాలపల్లి, ములుగు జిల్లాల స్థాయి క్రికెట్ క్రీడలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో ఆరోగ్యంగా ఉండడంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని కూడా పెంపొందించుకోవచ్చని అన్నారు. యువత వారిలోని ప్రతిభను బయటకు తీస్తే విజయం సొంతం అవుతుందన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తరుపున సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పరకాల మార్కెట్ కమిటీ చైర్మన్ మాజీ పోలేపల్లి శ్రీనివాస్ రెడ్డి, గణపురం మాజీ ఎంపీపీ ఎర్రబెల్లి రామేశ్వర్ రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రేపాక రాజేందర్, పీఏసీఎస్ చైర్మన్ కన్నెబోయిన కుమార్, ముదిరాజ్ కమిటీ నాయకులు చాడ కిష్టస్వామి, కొటం రమేశ్, జోడు ప్రదీప్ పాల్గొన్నారు.

వార్షికోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే..

రేగొండ: మండల కేంద్రంలోని శ్రీ సందీప శ్రీ కృష్ణ సద్గురు ఆనంద పీఠం వార్షికోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సద్గురు బోధ ద్వారా సమాజం, వ్యక్తిగత నడవడి గురించి అనేక విషయాలు తెలుసుకోవచ్చన్నారు. ఆశ్రమ అభివృద్ధి కోసం తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని హామీ ఇచ్చారు. అనంతరం ఆశ్రమ నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బండి చక్రపాణి, కట్ల సంజీవరెడ్డి, కట్టంగూరి మనోహర్‌రెడ్డి, పట్టెం శంకర్, ఏనుగు రవీందర్ రెడ్డి , గూటం లింగారెడ్డి, ఎర్రబాటి రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సద్గురు ఆనంద పీఠాన్ని సందర్శిస్తున్న ఎమ్మెల్యే

సమస్యలపై నిరంతర పోరాటం

వెంకటాపురం(కె): ఆదివాసీల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తా అని తెలంగాణ భూమి పుత్ర ఆదివాసీ సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పూనెం రామచందర్ అన్నారు. మండల పరిధిలోని ఎదిరగుట్ల సమీపంలోని సమ్మక్క, సారలమ్మ గుడి ప్రాంగణంలో తెలంగాణ భూమి పుత్ర ఆదివాసీ సంఘాన్ని గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పూనెం రామచందర్ మాట్లాడుతూ.. ఆదివాసీ సమాజం వెనకబాటు తనానికి గురవుతుందని వాపోయారు. ఆదివాసీలకు గుర్తింపు కరువు అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీల హక్కుల రక్షణ కోసం ఈ సంఘం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బా జిల్లా అధ్యక్షుడు చింత సోమరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు యట్టి రాజబాబు, తెలంగాణ భూమిపుత్ర ఆదివాసీ సంఘం నాయకులు మునేశ్వరావు, యాలం నవీన్, పూనెం సాయిచరణ్, రాంబాబు, పవన్‌కుమార్ తదితరులు ఉన్నారు.



సంఘం ప్రారంభోత్సవంలో నాయకులు

బీజేపీ శక్తి కేంద్రం ఇన్‌చార్జ్‌గా రమేశ్



రమేశ్

మల్హర్: మండలంలోని తాడిచర్ల బీజేపీ శక్తి కేంద్రం ఇన్‌చార్జ్‌గా మల్లెవేణి రమేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ మండల అధ్యక్షుడు ముడుతనపల్లి ప్రభాకర్ గురువారం రమేశ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. తనపై నమ్మకంతో తాడిచర్ల శక్తి కేంద్రం ఇన్‌చార్జ్‌గా పదవి బాధ్యతలు అప్పగించడంపై పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునీల్ రెడ్డి, మంథని అసెంబ్లీ కన్వీనర్ మల్క మోహన్ రావు, మండల అధ్యక్షుడు ప్రభాకర్‌లకు రమేశ్ కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ బలోపేతమే లక్ష్యంగా పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానని వెల్లడించారు.

‘మాదిగలను విస్మరించిన కాంగ్రెస్’

భూపాలపల్లి రూరల్: కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు ఎన్నికల్లో మాదిగలకు ఒక ఎంపీ సీటు ఇవ్వకుండా విస్మరించిందని ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు అంబాల చంద్రమౌళి మాదిగ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు దోర్నాల రాజేందర్ మాదిగ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో చంద్రమౌళి మాదిగ మాట్లాడారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలను కాంగ్రెస్ పార్టీ సీఎం రేవంత్ రెడ్డి అణిచివేస్తున్నారని అన్నారు. రాజకీయపరంగా ప్రభుత్వంలో మాదిగల ప్రాధాన్యతను తగ్గిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో వెలమరాజ్యం పోయి రెడ్ల రాజ్యం వచ్చిందని, ఏపదవిలో చూసిన కాంగ్రెస్ ప్రభుత్వంలో రెడ్డిలే అధికంగా కనబడుతున్నారన్నారు. అంబేడ్కర్ జయంతి రోజున హైదరాబాద్ నడిబొడ్డున 125 అడుగుల ఎత్తులో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేయకుండా అవమానించారన్నారు. ఈ పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ పార్లమెంట్ టికెట్లను మాదిగలకు కేటాయించి సముచిత స్థానాన్ని కల్పించి మాదిగలపై నిబద్ధతను చాటుకుందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు నోముల శ్రీనివాస్, అంతడుపుల సురేష్, మంద తిరుపతి, దోర్నాల భరత్, మంద కిరణ్ బోడికల శ్రీకాంత్, మంతెన రాజు, ఒంటేరు కుమార్, సిరికొండ సునీల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అంబాల చంద్రమౌళి

పరామర్శ



నివాళులర్పిస్తున్న రాజేందర్ గౌడ్

ములుగు రూరల్: మండల పరిధిలోని మదనపల్లి గ్రామానికి చెందిన సిలపాక సాల్మన్ అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు, నియోజకవర్గ కో ఆర్డినేటర్ గొల్లపెల్లి రాజేందర్ గౌడ్ గురువారం పరామర్శించారు. మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె జైపాల్ రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ప్రచార కార్యదర్శి నూనేటి శ్యామ్, జన్నే రవి, చిలపాక సాగర్, సతీష్, రాజేందర్ సింగ్, రేవంత్, దేవేందర్, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేస్తేనే గుర్తింపు

ఏటూరునాగారం: ఉద్యోగంలో నిబద్ధతతో పనిచేస్తేనే గుర్తింపు లభిస్తోందని గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాములు అన్నారు. మల్యాల ఆశ్రమ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న పాయం మీనయ్య పదవీ విరమణ కార్యక్రమం గురువారం మండలంలోని చిన్నబోయినపల్లి ఆశ్రమ పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని చెంచయ్య, ఉపాధ్యాయ సంఘాల నాయకులు హాజరై మీనయ్యను సన్మానించారు. అనంతరం చెంచయ్య మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్‌కు దశ దిశగా ఉండాలన్నారు. గతంలో మల్యాలలో వరదల సమయంలో 40 మంది విద్యార్థులను కాపాడినందుకు ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సారంగపాణి, కొండ చెంచయ్య, మైపతి సంతోష్, పొదెం కృష్ణప్రసాద్, బానోత్ శ్రీను, రమేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మీనయ్యకు జ్ఞాపికను అందజేస్తున్న ఉపాధ్యాయులు

అట్రాసిటి కేసు నమోదు చేయాలి



మాట్లాడుతున్న వెంకటకృష్ణ

వాజేడు: ఆదివాసీ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన గిరిజనేతర యువ నాయకుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ జిల్లా కార్యదర్శి కనితి వెంకటకృష్ణ అధికారులను డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ.. వెంకటాపురం(కె) మండలానికి చెందిన గిరిజనేతర యువ నాయకుడు ఆదివాసీ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపించారు. వెంటనే వారిపై చట్ట పరంగా చర్యలను తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమ్మయ్య, శ్రీకాంత్ ఉన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

భూపాలపల్లి అర్బన్: పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు ఒలంపియాడ్ ఫలితాల్లో అత్యధిక శాతం ఉత్తీర్ణత సాధించి విజయదుందుభి మోగించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రూప తెలిపారు. ఫిబ్రవరి 2024 లో జరిగిన ఐఎస్టీఎస్ఓ సెకండ్ లెవెల్ పరీక్షలో 198 మంది విద్యార్థులు హాజరకాగా అందులో 195 మంది విద్యార్థుల్లో 24 గోల్డ్ మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్స్ 104, కన్సొలేషన్ 63, స్పెషల్ 04, సాధించి ఆల్ ఇండియాలో రెండవ, నాల్గవ, ఐదవ బహుమతులను సాధించినట్లు తెలిపారు. ఈ మేరకు పాఠశాల ఆవరణలో ఉత్తీర్ణులైన విద్యార్థులను యాజమాన్యం గురువారం అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ మల్లేంపాటి శ్రీవిద్య , డిజిఎం చేతన్, కోఆర్డినేటర్ శివకోటేశ్వరరావు, అకాడమిక్ డీన్ స్వామి, ఇంచార్జీ రాజులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

గోవిందరావుపేట: బాల్య వివాహాలను అరికట్టాలని చైల్డ్ హెల్ప్‌లైన్ కేసు వర్కర్ రాంబాబు అన్నారు. మండల పరిధిలోని మచ్చాపూర్ గ్రామ పరిసర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఉపాధిహామీ కూలీలకు గురువారం చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది ములుగు వారి ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. బాల్య వివాహాలు బాలికల అభివృద్ధికి విఘాతంగా మారుతున్నాయని అన్నారు. బాల్య వివాహానికి గురైన బాలికలు శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యపరంగా, సామాజిక ఎదుగుదల విషయంలో ఎన్నో ఇబ్బందులు పడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి స్వాతి, సఖి కేసు వర్కర్ సాధన ఉన్నారు.

యువత గంజాయికి బానిసకావొద్దు

చిట్యాల: మండలంలో ఎక్కడైన గంజాయి విక్రయించినట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై శ్రావన్‌కుమార్ కోరారు. గురువారం మండల కేంద్రంతోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో గంజాయి, కల్తీకల్లు నిర్మూలనపై వాల్ పోస్టర్లు అంటించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. మండలంలోని యువత గంజాయి మత్తుకు బానిస కాకూడదని అన్నారు. అలాగే కల్తీకల్లు విక్రయించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సిద్దు, లాల్‌సింగ్, నవీన్, లింగన్న తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ అంటిస్తున్న ఎస్సై శ్రావన్‌కుమార్

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

టేకుమట్ల: వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై గోగికారి ప్రసాద్ అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు, మండలంలోని రామకిష్టాపూర్(టి) ట్రాక్టర్ డ్రైవర్లు, ఓనర్లకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాక్టర్ ట్రాలీలకు రేడియం స్టిక్కర్లను అంటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాత్రి వేళల్లో రోడ్లపై ట్రాక్టర్లను నిలిపినప్పుడు ప్రమాదాలు జరుగకుండా రేడియం స్టిక్కర్లు ప్రమాద హెచ్చరికలు జారీ చేస్తుందన్నారు. ప్రతీ వాహనదారులు వాహనాలకు రేడియం స్టిక్కర్లను అంటించాలన్నారు. అలాగే ప్రతీ వాహనదారులు వాహన పత్రాలతో పాటు, డ్రైవింగ్ లైసెన్స్‌ను తప్పకుండా కలిగి ఉండాలని సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. ఆయన వెంట ఏఎస్సై అమరేందర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు, వాహన డ్రైవర్లు, ఓనర్లు ఉన్నారు.



రేడియం స్టిక్కర్లపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై ప్రసాద్

బీజేపీతోనే పేదలకు న్యాయం



కాటారం: ఎన్నికల ప్రచారంలో చపాతి కాలుస్తున్న గోమాస శ్రీనివాస్

కాటారం: బీజేపీతోనే బడుగు బలహీన వర్గాల న్యాయం జరుగుతుందని ఆ పార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డితో కలిసి కాటారం, మహదేవపూర్ మండలాల్లో గురువారం ప్రచారం నిర్వహించారు. మహదేవపూర్ మండల కేంద్రంలో బీజేపీ కార్యాలయం ప్రారంభించారు. కాటారం ప్రధాన కూడలిలో దుకాణదారులను కలిసి ఓటు అభ్యర్థించారు. ప్రజా ఆశీర్వాదంతో బీజేపీ మరోసారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. బండం మల్లారెడ్డి, దుర్గం తిరుపతి, గంట అంకయ్య పాల్గొన్నారు.

‘అభివృద్ధి కోసం బీజేపీకి ఓటేయండి’

మహాముత్తారం: బడుగు, బలహీన వర్గాలు అభివృద్ధి చెందాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటేయాలని ఆ పార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ అన్నారు. పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డితో కలిసి మండలకేంద్రంతో పాటు యామన్‌పల్లి గ్రామంలో గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పూర్ణచందర్, మండల ఇన్‌చార్జ్ దుర్గం తిరుపతి, ప్రధాన కార్యదర్శి పసుల శివ, యువ మోర్చా నాయకుడు నవీన్, నాయకులు శేఖర్, రమేష్ పాల్గొన్నారు.

పనులు వెంటనే చేపట్టాలి

పలిమెల: మండలంలోని అమ్మ ఆదర్శ పాఠశాల పనులలో భాగంగా కలెక్టర్ ద్వారా పరిపాలన అనుమతులు పొందిన పాఠశాలలో పనులు వెంటనే చేపట్టాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అధికారులకు, కమిటీ సభ్యులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాలల పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ.. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు పనులు ప్రారంభించాలని తెలిపారు. పనులు త్వరగా ప్రారంభించి పాఠశాలల పునఃప్రారంభం నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీఓ ప్రకాశ్‌రెడ్డి, కాంప్లెక్స్ హెచ్‌ఎం వెంకట్‌రాజు, ఇన్‌చార్జ్ ఏపీఎం రవికుమార్, తదితరుల పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్

వీరభద్రవరంలో వ్యక్తి ఆత్మహత్య

వెంకటాపురం(కె): మండల పరిధిలోని వీరభద్రవరం గ్రామంలో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. వీరభద్రవరం గ్రామానికి చెందిన కొంగుర వెంకటేశ్వర్లు(48) మద్యానికి బానిసయ్యాడు. కాగా, బుధవారం రాత్రి వెంకటేశ్వర్లు ఉన్న వీధిలో పెళ్లి ఉండటంతో మద్యం తాగవొద్దని భార్య రాణి, కూతురు చెప్పారు. కాని రోజులాగానే మద్యం తాగి ఇంటికి వచ్చి మద్యం మత్తులో రాత్రి ఇంటి వెనుక ఉన్న పురుగుల మందు తాగాడని తెలిపారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంకటేశ్వర్లను వెంకటాపురం వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహిస్తుండగా మృతి చెందాడని పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.



వెంకటేశ్వర్లు మృతదేహం

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మల్హర్: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన మండలంలోని కొయ్యూరు–కాటారం ప్రధాన రహదారిపై గురువారం చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కాటారం నుంచి కారు మంథని వెళ్తుండగా మంథని నుంచి భూపాలపల్లి వైపునకు వస్తున్న లారీ కొయ్యూరు డాంబర్‌ప్లాంట్ సమీపంలో ఢీకొట్టింది. కారు ముందు భాగం నుజ్జునుజ్జు కాగా డ్రైవర్ రాజు కాలు, దవడ భాగానికి గాయాలయ్యాయి. కొయ్యూరు పోలీసులు చికిత్స నిమిత్తం రాజును భూపాలపల్లి ఆస్పత్రికి తరలించారు. విచారణ అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్సై నరేష్ వెల్లడించారు.



నుజ్జునుజ్జయిన కారు

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

రేగొండ: ములుగు జిల్లా బాణాలపల్లి గ్రామానికి చెందిన జక్కుల తిరుపతి (40) అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. జక్కుల తిరుపతి మార్చి 18న సమీప బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. కొత్తపల్లిగోరి మండలంలోని సుల్తాన్‌పూర్ శివారులోని మూలమలుపు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ఆటో అదుపుతప్పి ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. ప్రమాదంలో తిరుపతికి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. గురువారం ఉదయం పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.



తిరుపతి (ఫైల్)